# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-10-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశ టెలికాం రంగం స్వయంసమృద్ధ భారత్‌కు చిహ్నంగా నిలుస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.**

2. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఈ రోజు సమావేశమైంది.**

3. **కేంద్ర ప్రభుత్వం సవరించిన జీఎస్టీ ద్వారా ప్రజలకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.**

4. **ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శ్రీశైలం పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**

5. **2027 గోదావరి పుష్కరాలకు అనుగుణంగా నది తీరాన్ని అభివృద్ధి చేయనున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.**

==========================

దేశ టెలికాం రంగం స్వయంసమృద్ధ భారత్‌కు చిహ్నంగా నిలుస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఢిల్లీలోని యశోభూమిలో తొమ్మిదవ "ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2025" సదస్సును ప్రధానమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, దేశంలోని దాదాపు ప్రతి జిల్లాకు 5జీ సాంకేతికత అందుబాటులోకి వచ్చిందని అన్నారు. స్వదేశీ పరిజ్ఞానంతో కూడిన 4జి, 5జి సాంకేతికతలు డిజిటల్ కనెక్టివిటీని దేశ ప్రజలకు మరింత చేరువ చేస్తుందని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్.. 36 సెకన్లు

-------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి – ఎస్ఐపీబీ ఈ రోజు సమావేశమైంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో రాష్ట్రంలో పెట్టుబడుల కోసం వచ్చిన వివిధ ప్రతిపాదనలపై చర్చిస్తున్నారు. ఎస్ఐపీబీ సమావేశానికి మంత్రులు నారా లోకేష్, కె.అచ్చెన్నాయుడు, పి.నారాయణ, టీజీ భరత్, కందుల దుర్గేష్, అనగాని సత్యప్రసాద్ హాజరయ్యారు.

-------------------------

కేంద్ర ప్రభుత్వం సవరించిన వస్తు సేవల పన్ను – జీఎస్టీ ద్వారా ప్రజలకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. జీఎస్టీ మార్పుల గురించి అవగాహన కల్పించే గోడపత్రికలను కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని నోబుల్ కాలనీలో ఆయన ఈరోజు ఆవిష్కరించారు. జీఎస్టీ సంస్కరణలతో సామాన్య ప్రజలకు ఏ విధంగా మేలు జరిగిందనే విషయాలపై అవగాహన కల్పిస్తున్నామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ,

వాయిస్...31 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శ్రీశైలం పర్యటనకు సంబంధించి ప్రణాళికాబద్ధంగా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి శ్రీశైలం పర్యటన ఏర్పాట్లపై కర్నూలు జిల్లా కలెక్టర్ ఏ.సిరితో అమరావతి నుంచి దృశ్య మాధ్యమం విధానంలో ఈరోజు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ట్రాఫిక్ అధికంగా ఉండే ప్రాంతాలను ముందస్తుగానే గుర్తించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. శ్రీశైలంలో స్థానికంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, రహదారుల మరమ్మతుల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

---------------------------

కాకినాడ జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కాకినాడ పార్లమెంటు సభ్యులు టి ఉదయ శ్రీనివాస్ తెలిపారు. కాకినాడలో ఏర్పాటు చేసిన బీచ్ పార్క్‌ను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయ శ్రీనివాస్ మాట్లాడుతూ , భారత నౌకాదళంలో సేవలు అందించిన ఎయిర్ క్రాఫ్ట్ ను బీచ్ పార్క్ లో ఏర్పాటు చేసుకోవడం శుభపరిణామమని అన్నారు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే విధంగా సుమారు ఐదు కోట్ల రూపాయలతో కాకినాడలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు.

---------------------------

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలోని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో వస్తు సేవల పన్ను–జీఎస్టీ తగ్గింపుపై విద్యార్థులకు ఈరోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా జీఎస్టీ తగ్గింపుపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. అనంతరం ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థిని నసిహ భాను మాట్లాడుతూ..

వాయిస్ 20 సెకన్లు

---------------------------

రానున్న గోదావరి పుష్కరాలకు అనుగుణంగా నది తీరంలోని స్నానాల రేవులతోపాటు, పంచారామ క్షేత్రాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో 2027 జూలైలో గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులపై సంబంధిత శాఖల అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకొల్లులో గోదావరి వెంబడి ఘాట్‌ల అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదిత అంచనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా

ఆయన మాట్లాడుతూ, గోదావరి పుష్కరాల స్నానాలకు వచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

---------------------------

గిరిజనుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జె.హుస్సేన్ అధికారులను ఆదేశించారు. ఏలూరు జిల్లా కోటరామచంద్రాపురంలో నిన్న పర్యటించిన ఆయన గిరిజనులు, గిరిజన సంఘాల ప్రతినిధుల నుండి అర్జీలను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం కోసమే జాతీయ ఎస్టీ కమిషన్ పనిచేస్తుందని చెప్పారు. అర్హత కలిగి, నిబంధనల మేరకు పరిష్కరించదగిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పునరావాసం ప్యాకేజీని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను హుస్సేన్ ఆదేశించారు.

---------------------------

షెడ్యూల్డ్ కులాల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు –ఎస్సి కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్ అన్నారు. నెల్లూరులో వివిధ సంక్షేమ శాఖల అధికారులతో ఆయన ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలలో మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.

---------------------------

నైరుతి బంగాళాఖాతం, తమిళనాడు తీర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈరోజు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకావముందని వాతారవరణ శాఖ అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ,

..వాయిస్.. 23 సెకన్లు

---------------------------

అర్హులైన ఆటో డ్రైవర్లకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు “ఆటో డ్రైవర్ల సేవలో” పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తోందని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ప్రభుత్వం అమలు చేసిన “ఆటో డ్రైవర్ల సేవలో” పథకంలో భాగంగా మైనారిటీల వర్గాలకు చెందిన డ్రైవర్లకు 4 కోట్ల 13 లక్షల రూపాయల లబ్ధి చేకూరిందని మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు.

=====================